ప్రజాశక్తి
బుధవారం 25 జనవరి 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

వడ్డీ లేకుండా

# రీషెడ్యూల్ చేయండి

## బ్యాంకర్లను కోరిన పొగాకు రైతులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తుపానుకు పంట దెబ్బతిని తీవ్రంగా నష్టం జరిగినందున వడ్డీ లేకుండా రుణాలను రీషెడ్యూల్ చేయాలని పొగాకు రైతులు బ్యాంకర్లను కోరారు. మంగళవారం నాడు పొగాకు బోర్డు కార్యాలయంలో రీజినల్ మేనేజర్ డాక్టర్ ఎం.కృష్ణశ్రీ, సెక్రటరీ వేణుగోపాల్ రైతుల సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎల్‌డిఎంతో పాటు అన్ని బ్యాంకుల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరైన రైతులు తమ బాధలు చెప్పుకున్నారు. రైతులు శింగయ్య, రమణయ్య తదితరులు మాట్లాడుతూ పొగాకు పంట దెబ్బతిని దిగుబడి పోయిందన్నారు. తీసుకున్న రుణాలు కూడా చెల్లించలేని స్థితిలో రైతులున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో వడ్డీ లేకుండా రుణాలు రీషెడ్యూల్ చేయాలని కోరారు. తిరిగి రుణాలు కూడా ఇవ్వాలని కోరారు. ఇదే ఎజెండాపై చర్చ సాగింది. బ్యాంకు అధికారులు స్పందిస్తూ ఈ విషయం ఉన్నతాధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని సమావేశంలో వెల్లడించారు. బ్యాంకుల మధ్య వడ్డీ రేట్ల తేడాలపైనా చర్చించారు. మూడు లక్షల రుణంపై బ్యాంకుల మధ్య వడ్డీరేట్ల విషయంలోనూ హెచ్చుతగ్గులున్నాయనే విషయంపైనా చర్చ సాగింది. ఒకే వడ్డీ ఉండేలా చూడాలని బ్యాంకు అధికారులకు సూచించారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే బ్యాంకులకు డిపాజిట్ ప్రాధాన్యత ఇస్తామని బోర్డు అధికారులు సూచించారు. అయితే ఈ సమావేశంలో పొగాకు రైతులకు సంబంధించి ఎటువంటి నిర్ణయాలూ తీసుకోలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని మాత్రమే బ్యాంకర్లు చెప్పారు.

వైసిపిని వణికిస్తున్న

# గ్రూపుల పోరు



- అన్ని నియోజకవర్గాల్లో ముఖ్య నేతలకు అసమ్మతులు
- ఉమ్మడి ప్రకాశంలో అభ్యర్థులను ఖరారు చేస్తున్న అధిష్టానం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

**వైసిపిలో దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో గ్రూపుల పోరు కొనసాగుతోంది. ఎమ్మెల్యేలకు, ఇన్‌ఛార్జిలకు పోటీగా కొందరు నేతలు అసమ్మతి బావుటా ఎగుర వేస్తున్నారు. అధిష్టానం నుంచి వచ్చిన పెద్దలకు తమ బాధలు మొరపెట్టుకుంటున్నారు. కొందరు ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిల తీరు వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని ఫిర్యాదు చేస్తున్నారు. తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెప్పుకుంటున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పాలకపక్షంలో ఈ తరహా ధోరణులు ఆందోళన కలిగిస్తున్నాయి. కోఆర్డినేటర్లకూ సవాలుగా మారాయి. అందరినీ ఏకతాటిపైకి తేవడం సమస్యగానే మారింది. నాయకత్వ సమన్వయం కోసం పావులు కదుపుతున్నారు. సర్దుబాటు చేసేందుకు జిల్లా నేతలూ ప్రయత్నాలు చేపట్టారు. ఎంత మేరకు సర్దుబాటు అవుతాయన్నదే చూడాల్సి ఉంది.**

కొండపి ఏఎంసీ ఛైర్మన్ పదవీ ప్రమాణానికి సీనియర్ నేత బాలినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికే కొండపి నియోజకవర్గంలో గతంలో ఇన్‌ఛార్జిగా ఉన్న డాక్టర్ మాదాసి వెంకయ్య గ్రూపు దూరంగా ఉంది. బాలినేని కూడా నేతల మధ్య అసంతృప్తి విషయాన్ని ప్రస్తావించారు. ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు అందరినీ కలుపుకొని పోవాలని సూచించారు. ఆయనతో విభేదించే నేతలందరూ ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్న విషయాన్ని కూడా బాలినేని గ్రహించే ఈ వ్యాఖ్యలు చేశారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కొండపి నియోజకవర్గంలో రెండు గ్రూపులు కొనసాగుతున్నాయి. అధికారంతో పాటు పదవులు.. ప్రాధాన్యతల విషయంతో ఇన్‌ఛార్జి వరికూటి గ్రూపునకు, మాదాసి వెంకయ్య గ్రూపునకు మధ్య పోరు నడుస్తోంది. జిల్లా నేతల వద్ద అనేక పంచాయితీలు జరిగినా సర్దుబాటు కావడం లేదు. సంతనూతలపాడు నియోజకవర్గంలోనూ మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో ఎమ్మెల్యే సుధాకర్‌బాబుకు అసమ్మతి ఉంది. మండల స్థాయి ముఖ్యనేతలు ఎమ్మెల్యేతో విభేదించి పలు రకాలుగా వ్యవహారాలు నడుపుతున్నారు. వాటిని దారికి తెచ్చుకునేందుకు ఆయన కసరత్తు చేపట్టారు. ఇక్కడ సమన్వయం ఎండమావిగానే కనిపిస్తోంది. దర్శి నియోజకవర్గంలో కీలక నేతల మధ్యనే సఖ్యత లేదు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌కు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మధ్య సమన్వయం లేదు. మాటలు కూడా లేవు. కార్యక్రమాలకు ఆహ్వానాలు కూడా లేవు. ఇక్కడా సీటు విషయంలో ఇద్దరూ పావులు కదుపుతున్నారు. వచ్చే ఎన్నికలు కీలకంగా మారాయి. పార్టీలో ముఖ్యనేతలే రెండు గ్రూపులుగా చీలిపోయారు. మండలాల్లోనూ నేతలు గ్రూపులుగా మారారు. విభజన స్పష్టంగా ఉంది. ఎన్నికల నాటికి ఏ పరిణామాలకు దారితీస్తాయన్నదే చూడాలి. మార్కాపురంలోనూ ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి వ్యతిరేకంగా నేతలు పావులు కదుపుతున్నారు. ఇక్కడ వచ్చే ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకే వెంకటరెడ్డితో పాటు మరో యువ నేత పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి కూడా టిక్కెట్టు కోసం ప్రయత్నాల్లో ఉన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు మండల స్థాయి నేతలు అసమ్మతిగా మారారు. చాలా కాలంగా ఇక్కడ ఎమ్మెల్యేకూ, మండల నేతలకు మధ్య సఖ్యత కొరవడింది. వేరుకుంపట్లు పెట్టి ఎమ్మెల్యేను సవాలు చేసే స్థాయికి ఇక్కడ గ్రూపురాజకీయాలు మారాయి. కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రా మధుసూధన్‌యాదవ్‌కు వ్యతిరేకంగా రెడ్డి కార్పొరేషన్ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇక్కడ నేతల సామాజిక అంతరాలు బాగా పెరిగాయి. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కీలకమైన రెడ్డి సామాజికవర్గ నేతలు అసంతృప్తిగా ▶ 2లో

# దళితుల భూపోరాటం

- సాగు కోసం చింతలంక, పెదలంక పేదల భూఆక్రమణ
- పట్టాలివ్వాలని అధికారులను, కోరినా పట్టించుకోని వైనం
- కృష్ణా నది పక్కన 100 ఎకరాల్లో ముళ్ల పొదలు తొలగించి.. స్వాధీనం




భూమిలో ముళ్లపొదలు తొలగించి.. శుభ్రం చేస్తున్న దళితులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు (కొల్లూరు)

**కృష్ణానది పక్కన ఖాళీగా ఉన్న భూములను ఇస్తే సాగు చేసుకుంటామని కొల్లూరు మండల పరిధిలోని చింతలంక, పెదలంక పరిధిలోని దళితులు ఎన్నో సార్లు పాలకులను, అధికారులకు కలిసి విన్నవించుకున్నారు. ఎన్ని సార్లు అర్జీలిచ్చినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం, కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో భూపోరాటానికి సిద్ధమయ్యారు. మంగళవారం ఈ రెండు గ్రామాల పేదలందరూ కలిసి కృష్ణానది పక్కన ఉన్న సుమారు 100 ఎకరాల్లో ముళ్లపొదలను తొలగించి.. శుభ్రం చేసి.. ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు.**

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భూమి లేని పేదలు ఎన్నో నెలలుగా కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు.. స్థానిక మంత్రికి.. భూమిపై హక్కులు కల్పించాలని వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. ఈ నేపథ్యంలో సుమారు 200 మంది పేదలతో కలిసి మంగళవారం నాడు భూమిలో పొదలు, ముల్ల కంప తొలగించామన్నారు. ఈ భూముల పక్కనే ఉన్న కష్ణా నదిలో అక్రమార్కులు లక్షలాది రూపాయల విలువైన ఇసుకను కొల్లగొడుతన్నా అధికారులు చోద్యం చూస్తున్నారని, కానీ పేదలు భూమిని శుభ్రం చేస్తుంటే రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని.. భూమిలో నుంచి వెళ్లిపోవాలని అనడం దుర్మార్గమైన చర్యని పేర్కొన్నారు. ఈ భూములను పేదలకు పంపిణీ చేయాలని సొసైటీగా అధికారులకు విన్నవించినట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చేసి ఈ భూములపై హక్కులు కల్పించాలని కోరారు. ఈ భూములపై పేదలకు పూర్తి హక్కులు కల్పించని పక్షంలో రాబోయే రోజుల్లో కొల్లూరు తహశీల్దార్ ఆఫీస్ వద్ద పేదలందరూ కలిసి వంటావార్పు కార్యక్రమం పెట్టి.. నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు టి.సురేష్, నాయకులు బి.సుబ్బారావు, పేదలు టి.లాజరు, జి ప్రభాకర్‌రావు, తోడేటి సంసోను. ఈపూరు ఏసోబు, చిలుమూరు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పిడిఎఫ్ అభ్యర్థులకు

# అండగా నిలవండి

ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం



మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రమణ్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

రానున్న శాసనమండలి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు అందరూ అండగా నిలవాలని పిడిఎఫ్ శాసన మండలి ఫ్లోర్‌లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. మంగళవారం నాడు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శింగరాయకొండ మండలంలో ▶ 2లో



మాట్లాడుతున్న మోపిదేవి వెంకటరమణ

# వైసిపి అద్దంకి అభ్యర్థి కృష్ణచైతన్యే..

పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకటరమణారావు ▶ 7లో

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయరా?

**- మొలకెత్తిన, రంగు మారిన వడ్లను కొనుగోలు చేయని వైనం**
**- ఆందోళనలో రైతులు**

**ప్రజాశక్తి-భట్టిప్రోలు**

వర్షాలు, తుఫాను సమయంలో తడిచిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం ఉదరగొట్టిన మాట ఉత్తుత్తి గానే కనిపిస్తుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి కోతలు ప్రారంభమైన సమయంలో తుఫాను కారణంగా కురిసిన వర్షానికి వరి ఓదేలు నీటి మునిగాయి. రోజుల తరబడి నీటిలో ఉండటంతో గింజలు నాని రంగుమారి, మొలకలు వచ్చాయి. కొంత మేర కోత కోయకుండానే నేలవాలడంతో పంట దెబ్బతింది. ఆ సమయంలో మంత్రులు, అధికారులు పర్యటించి పంటలు దెబ్బతిన్న రైతులను ఓదార్చారు. దెబ్బతిన్న ప్రతి గింజను మద్దతు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నమ్మబలికారు. ఇది జరిగి 45 రోజులు గడిచిపోయింది. ఇంత వరకూ ఎక్కడా తడిచిన ధాన్యం గింజ కూడా కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. రైతు భరోసా కేంద్రాలలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాటిలో ధాన్యం బాగుంటేనే కొనుగోలు చేస్తున్నారు.తడిచిన ధాన్యం కొనుగోలు చేసేందుకు తమకు ఎలాంటి అనుమతి రాలేదని రైతు భరోసా సిబ్బంది చెబుతున్నారు. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. బయట వ్యాపారులను సంప్రదిస్తే బస్తా ధాన్యం రూ.700 నుంచి రూ.900 మాత్రమే అడుగుతున్నారని, దీంతో ఏమి చెయ్యాలో దిక్కుతోచటం లేదని రైతులు వాపోతున్నారు. మండలంలో 15 వేల ఎకరాలలో దాదాపుగా 50 శాతం పైగా పంట ఓదేలు దశలోనే దెబ్బతింది. 30 శాతం పైగా పంట నేలకొరిగింది. తడిచిన ఓదేలు కుప్పలు వేసి భూమి ఆరిన తర్వాత నూర్పిడులు చేశారు. ధాన్యం కొనుగోలు చేయాలని రైతు భరోసా సిబ్బందిని సంప్రదిస్తే తమకు ఎలాంటి అనుమతి లేదని చెబుతున్నట్లు రైతులు వాపోతున్నారు. అనుమతి వచ్చేంత వరకూ ఇళ్లలోనే ఉంచుకోవాలని ఉచిత సలహా ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసిన అప్పులు వడ్డీ పెరుగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. తడిసిన ధాన్యం కొనుగోలు విషయం గురించి మార్క్ఫెడ్ సిసి కాంతారావు మాట్లాడుతూ తడిచిన,మొలకెత్తిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదన్నారు.అనుమతి రాగానే కొనుగోలు చేస్తామని చెప్పారు.


కల్లంలో ఉన్న వరి ధాన్యం

## వైసిపిని వణికిస్తున్న గ్రూపుల పోరు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. వైపాలెంలో మంత్రి ఆదిమూలపు సురేష్‌కు ఈ సమస్యలు తప్పడం లేదు. బాపట్ల జిల్లా పరిధిలో రెండు రోజులుగా అభ్యర్థులను ఖరారు చేస్తున్నారు. చీరాల ఇన్‌చార్జిగా కరణం వెంకటేశ్‌ను ఖరారు చేశారు. ఈ విషయాన్ని క్యాడర్‌కు స్పష్టంగా చెప్పి గెలుపునకు కృషిచేయాలని కోరారు. చీరాల్లో ఆమంచి కృష్ణమోహన్ గ్రూపు అక్కడ ఏదో తరహాలో తమ ఆధిపత్యం కోసం పావులు కదుపుతూనే ఉంది. పర్చూరు నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి మార్పు జరిగాక నిన్నటి వరకూ ఇన్‌ఛార్జిగా ఉన్న రావి రామనాథంబాబు గ్రూపు అసంతృప్తిగా ఉంది. వీరంతా టిడిపి వైపు చూస్తున్నారనే చర్చ సాగుతోంది. అద్దంకి ఇన్‌ఛార్జి కృష్ణచైతన్యను వచ్చే ఎన్నికల్లో అభ్యర్థిగా ప్రకటించారు. ఆయనకు వ్యతిరేకంగా ఉన్న గ్రూపు నేతలు కూడా కోఆర్డినేటర్ భూమనకరుణాకర్‌రెడ్డిని కలిశారు. చైతన్య తీరుపై ఫిర్యాదులు చేశారు. ఇలా దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో వైసిపిలో గ్రూపులు కొనసాగుతున్నాయి. వీటిపై అధిష్టానం కూడా ఏమీ చేయలేని స్థితిలో పడింది. ఇక్కడ పార్టీ పరిస్థితులను చూసే బాధ్యతలో లేకపోయినా బాలినేని వద్దకు నేతల పంచాయితీలు తప్పడం లేదు. బాపట్ల జిల్లాలోని అద్దంకి, పర్చూరు, చీరాల అభ్యర్థులు తేలిపోయారు. ప్రకాశం జిల్లాలో ఈ ప్రక్రియ ఇంకా జరగాల్సి ఉంది. టిక్కెట్టుపై ఏ విషయం తేలనందున ఎమ్మెల్యేల్లోనూ ఉత్కంఠ నెలకొంది.

## పిడిఎఫ్ అభ్యర్థులకు అండగా నిలవండి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన పర్యటించారు. శింగరాయకొండ బాలికల ఉన్నత పాఠశాల, పాకల, ఊళ్లపాలెం, పాత శింగరాయకొండ, మూలగుంటపాడు హైస్కూల్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలు చాలా కీలకమని, పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకుంటే ఉద్యోగ ఉపాధ్యాయులకు అండగా ఉంటారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి ఉపాధ్యాయ రంగం నుంచే బయటకు వచ్చారన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం వాళ్లు పోరాటాలు చేసిన చరిత్ర ఉందన్నారు. అలాంటి వారిని శాసనమండలికి పంపిస్తే అందరికీ అండగా ఉంటారన్నారు. కొందరు అభ్యర్థులు దొంగ ఓట్లు నమోదు చేసుకొని గెలవాలని ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. హైస్కూల్‌కి చాక్లెట్లు ఇచ్చారని, మండల పరిషత్తు పాఠశాలలను మర్చిపోయారని చెప్పారు. అలాంటి అభ్యర్థులు ఉన్నారని.. అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు జె కేశవరాజు, రాజ సులోచన, టి.రామ్మూర్తి పాల్గొన్నారు.

## పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు లక్ష్మినారాయణ మృతి

**ప్రజాశక్తి - మద్దిపాడు**

మద్దిపాడు గ్రామానికి చెందిన పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి లక్ష్మి నారాయణ (90) సోమవారం రాత్రి మృతి చెందాడు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆర్యోగ పరిస్థితి విష మించడంతో మృతిచెందాడు. లక్ష్మి నారాయణ పాలకేంద్రం అభివృద్ధి ఎంతో కృషి చేశారు. లక్ష్మినారాయణ మృతదేహాన్ని మాజీ సర్పంచి బత్తిన సురేంద్ర బాబు, జి.నరసింహారావు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సందర్శించి నివాళులర్పించారు.


లక్ష్మి నారాయణ(ఫైల్)

**సిపిఎం నాయకుల నివాళి**

పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు ఉప్పుగుండూరి లక్ష్మి నారాయణ (90) మత దేహాన్ని సిపిఎం జిల్లా నాయకులు షేక్ మాబు, కాలం సుబ్బారావు, మండలనాయకులు కనపర్తి సుబ్బారావు, ఉబ్బా ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

# విజేతలకు నగదు బహుమతులు అందజేత

**ప్రజాశక్తి - పంగులూరు**

జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన జిల్లాస్థాయి పోస్టర్ ప్రదర్శన పోటీలో మండల పరిధిలోని బూదవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం. సాధ్విక ప్రథమ బహుమతి సాధించింది. చీరాలలోని కస్తూరిబా గాంధీ విద్యాయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాపట్ల జిల్లా కలెక్టర్ విజయ్ కష్ణన్ చేతుల మీదగా స్వాధిక నగదు బహుమతిని అందుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ .అనిత తెలియజేశారు. ప్రథమ బహుమతి సాధించిన సాధ్విక , గైడ్ టీచర్ సుధవాణిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. **చెరుకుపల్లి :** బాలిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బి.సాయి శ్రావ్య జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం రూ. 5 వేల నగదు బహుమతిని అందుకున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. శైలజ తెలిపారు. **మద్దిపాడు :** జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా స్త్రీ ,శిశు సంక్షేమ శాఖ, డిఎంహెహెచ్ఒ మరియు డిసిఇబి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో వ్యాసరచన, వకృత్త్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని చల్లా మమత జిల్లా ప్రథమ స్థానం, వకత్త్వ పోటీల్లో ద్వితీయ సాధించింది. కలెక్టర్ దినేష్ కుమార్ మమతను అందించి ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 5 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మమతను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు


నగదు బహుమతిని అందుకుంటున్నచల్లా మమత

## నర్సరీని పరిశీలించిన రేంజర్

**వేటపాలెం :** మండల పరిధిలోని రామన్న పేట మండల పరిషత్ ప్రాంగణంలోని నర్సరీని చీరాల ఫారెస్ట్ రేంజర్ ఆర్.శ్రీదేవి మంగళవారం తనిఖీ చేశారు కార్యక్రమంలో సెక్షన్ ఫారెస్ట్ ఆఫీసర్ జాన్సన్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, నర్సరీ మేస్త్రిలు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భవనాలను పూర్తిచేయాలి : కలెక్టర్

**ప్రజాశక్తి -బాపట్ల జిల్లా**

ఉపాధిహామీ పథకం నిధుల అనుసంధానంతో నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవననాలను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ కె. విజయకృష్ణన్ ఆదేశించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులపై పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులతో మంగళవారంకలెక్టర్ ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాలను అధికారులు దష్టిలో పెట్టుకొని ప్రభుత్వ భవనాలను గడువులోగా నిర్మించాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణపనులు మొదలు కాని ప్రాంతాలలో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ నిర్మాణ పనులలో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదన్నారు. బాపట్ల జిల్లాలో నేటికీ 29 గ్రామ సచివాలయాల భవనాలు మొదలు కాకపోవడంపై ఆరాతీశారు. రైతు భరోసా కేంద్రాలు 65, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ 80 భవనాల నిర్మాణ పనులు మొదలు కాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. చీరాల పట్టణంలో అధికంగా పెండింగ్‌లో ఉండడంపై ఆరాతీశారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవడం, నీరు నిల్వ ఉండడం, వివాదస్పదంగా ఉన్న భూముల సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. ఇసుక, సిమెంటు, ఇనుము వంటి వనరులు అందుబాటులో ఉన్నప్పటికి జరుగుతున్న జాప్యంపై ప్రశ్నించారు. ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న పనులన్నింటికీ బిల్లులు తక్షణమే ఆన్‌లైన్ లో నిక్షిప్తం చేయాలన్నారు. రేపల్లె నియోజకవర్గంలో 10 అభివద్ధి పనులకు రూ 1.90 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటివరకు రెండు పనులు పూర్తి కాగా, ఆరు పనులు పురోగతిలో ఉన్నాయని, మిగిలిన రెండు పనులు ప్రారంభం కాకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. పర్చూరులో రూ 22 లక్షల నిధులతో చేపట్టిన 22 పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. చీరాల నియోజకవర్గంలో రూ 46.4 లక్షల నిధులతో చేపట్టిన 14 పనుల పురోగతిపై ఆరాతీశారు. పురోగతి లేని 13 పనులకు సంబంధించి గుత్తేదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. గడప గడపకు మనప్రభుత్వం కింద మంజూరైన 469 పనులను ఇంజినీరింగ్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలనికలెక్టర్ ఆదేశించారు. ఇప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు తక్షణమే ప్రభుత్వానికి పంపాలన్నారు. ఈ సమావేశంలో పిఆర్ ఎస్ఇ. శ్రీనివాసులు, డిఇలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

# పేదల సంక్షేమమే ధ్యేయం : బూచేపల్లి

**ప్రజాశక్తి-నాగులుప్పలపాడు**

పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నట్లు జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. మండల పరిధిలోని పోతవరం గ్రామంలో ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నూరు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. ఎమ్మెల్యే సుధాకర్‌బాబు మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నలమలపు అంజమ్మ, సర్పంచి శీలం రేణుక, వైసిపి నాయకులు నలమలపు కష్ణారెడ్డి, శీలం సురేష్ ,ఇనగంటి పిచ్చిరెడ్డి, కంచర్ల సుధాకర్,యు.శ్రీనివాస ప్రసాదు,కోయి హనుమయ్య , మారెళ్ళ వెంకట శేషయ్య, అంజిరెడ్డి, ఎంపిడిఒ కుమారి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

**బాపట్ల రూరల్ :** అర్హులందరికీ పింఛన్లు అందజేస్తున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. మండల పరిధిలోని సూవర్ట్ పురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కోకి రాఘవ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు,అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



గడపగడపకూలో జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి



గడప గడపకూలో ఎమ్మెల్యే కోన రఘుపతి

**వేటపాలెం :** చల్లారెడ్డిపాలెం సచివాలయం-2 పరిధిలోని మంగళవారం పొట్టి సుబ్బయ్య పాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ప్రజలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఎంపిఎం,పంచాయతీ కార్యదర్శి శివలీల విఆర్ఓ అమూల్య , భూదాటి శ్రీనివాసరావు, ఎస్ఐ జి. సురేష్, ఎఒ కాశీవిశ్వనాథం, గ్రామ నాయకులు కోడూరు అంజయ్య, తాతయ్య,జాలయ్య పాల్గొన్నారు

# సామేలుకు పలువురు నివాళి

**ప్రజాశక్తి-కురిచేడు**

కురిచేడు మండలంలో వివిధ పత్రికల్లో విలేకరిగా పనిచేసిన కంభంపాటి చిన్న సామేలు సేవలు చిరస్మరణీయమని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు గొట్టిపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బ్రహ్మం తెలిపారు. గత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సామేలు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. అందులో భాగంగా సామేలు మతదేహాన్ని మంగళవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబానికి యూనియన్ తరుపున రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. తొలుత జడ్‌పిటిసి నుసుం వెంకట నాగిరెడ్డి సామేలు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామేల్‌కు నివాళులర్పించిన వారిలో టిడిపి డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సునీల్, మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు మొఘల్ మస్తాన్ వలి, కురిచేడు సొసైటీ అధ్యక్షుడు మర్రి సుబ్రహ్మణ్యం, కురంగి శ్రీనివాసులు, కోలా సంతోష్ కుమార్, బాదం సుబ్బారెడ్డి, గంధం గురునాథం, కోటి, గొట్టిపాటి సుబ్బ రామయ్య, బొనిగల అంకయ్య, చెన్నయ్య, వేమయ్య, ములకాల చిన్న సుబ్బారావు, దోరేపల్లి రామయ్య, కంభంపాటి చిన్న సామేలు, కంభంపాటి జడ్సన్ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

### ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బస్సు ..

# ఇద్దరు వ్యక్తులు మృతి

**ప్రజాశక్తి-తర్లుపాడు**

ద్విచక్ర వాహనాన్ని బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడ్కిడే మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని లింగారెడ్డి కాలనీ వద్ద మంగళవారం చోట చేసుకుంది. ఈ ప్రమాదంలో మార్కాపురంలోని కొండారెడ్డి కాలనీకి చెందిన విభూది పెద్దమౌలాలి (35), సుబ్బారాయుడు (33) మృతిచెందారు. మృతులు తమ సొంత పనుల నిమిత్తం మార్కాపురం నుంచి ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్తున్నారు. ఘటన స్థలం వద్దకు వచ్చేసరికి మార్కాపురం నుండి ఒంగోలు వెళుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీ కొంది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పొదిలి సిఐ సుధాకర్, తర్లుపాడు ఎస్ఐ ముక్కంటి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతిచెందిన వ్యక్తులు

# పరిటాల రవికి ఘన నివాళి

**ప్రజాశక్తి-రేపల్లె**

మాజీ మంత్రి, దివంగత పరిటాల రవి వర్థంతి ఘనంగా నిర్వహించారు. మండలంలోని నల్లూరుపాలెం గ్రామంలో పరిటాల రవీంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరిటాల యువసేన అధ్యక్షుడు దండమూడి ధరణి కుమార్,మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, సురేష్ , రాజేష్ , సుభాష్ ,చరణ్ , సుబ్బారావు, సోమయ్య, శ్రీధర్, రాజేశ్వరరావు, భువన్ చంద్, టిడిపి నాయకులు , కార్యకర్తలు, పరిటాల యువసేన సభ్యులు పాల్గొన్నారు.

**చీరాల :** మాజీ మంత్రి, దివంగత పరిటాల రవి వర్థంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి బాపట్ల పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు కౌతరపు జనార్ధన్ రావు, పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కోండ్రు రత్నబాబు, పులిపాటి శేఖర్, దగ్గుబాటి వెంకట్రావు, లావేటి శ్రీనివాసతేజ, లకం శివయ్య, మస్తాన్ రావు, బిట్రా చైతన్య, తేలప్రోలు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పరిటాల విగ్రహానికి నాయకులు నివాళి

**అద్దంకి :** దివంగత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 18 వ వర్ధంతి టిడిపి యువ నాయకుడు దామా సురేంద్ర సహకారంతో పరిటాల యూత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాల పరిటాల చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు భోజన వసతి కల్పించి భోజనం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహకురాలు పూనూరి ఆరోగ్యం, దూళ్లిపాళ కష్ణ చైతన్య, కాసా పుల్లయ్య, కోటి, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# వాలీబాల్ పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి-హనుమంతునిపాడు**

విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతి రెడ్డి తెలిపారు.రిపబ్లిక్ డే పురస్కరించుకొని మండల పరిధిలోని సీతారాంపురం జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను తిరుపతిరెడ్డి, హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్ సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి విద్యతోపాటు ఆట పాటల పట్ల ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, పిఇటి షేక్ జిలాని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేశ్వరరెడ్డి

## 'పగడాల'కు మాతృ వియోగం

**హనుమంతునిపాడు :** మండల పరిధిలోని పెద్ద గొల్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు పగడాల శ్రీరాములు రెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి వెంకట లక్ష్మమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందింది. టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తండ్రి నరసారెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు సాని కొమ్ము తిరుపతిరెడ్డి, నాయకులు గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, పివి.ఆచారి తదితరులు వెంకట లక్ష్మమ్మ సందర్శించి మాలవేసి నివాలులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



గోపి మృతదేహాన్ని పరిశీలస్తున్న కృష్ణమోహన్

## విద్యుత్‌షాక్‌తో బేల్దారి కూలీ మృతి

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**

విద్యుత్ షాక్‌తో బేల్దారి కూలీ మృతి చెందిన ఘటన మార్టూరు- గన్నవరం రోడ్డు లోని జగనన్న కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్ఐ ఎస్‌వి. రవీంద్రారెడ్డి కథనం ప్రకారం.. యద్దనపూడి మండలం యనమదల బీసీ కాలనికి చెందిన గుంజి గోపి (28) మార్టూరులోని జగనన్న కాలనీలో ఓ ఇంటి నిర్మాణ పనికి వచ్చాడు. ఇంటిపై పనులు చేస్తున్న క్రమంలో ఇసుక సువ్వలను పైకి లాగుతున్నాడు. అదే సమయంలో ఇనుప సువ్వ ఆ ఇంటి పై నుండి వెళుతున్న హైటెన్షన్ విద్యుత్ వైర్లకు తగిలింది. గోపి విద్యుత్ షాక్ కి గురై ఇంటి పై నుండి క్రింద పడిపోయాడు. తోటి కూలీలు గోపిని ఆటోలో మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే గోపి మతి చెందినట్లు నిర్ధారించారు. మతుడికి భార్య అనూష, కుమారుడు మణికంఠ, కుమార్తె అమూల్య ఉన్నారు.

**మృతదేహాన్ని సందర్శించిన ఆమంచి**

విద్యుత్ షాక్‌తో మృతిచెందిన గుంజి గోపి మతదేహాన్ని వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి కష్ణ మోహన్ స్థానిక వైసిపి నాయకులతో కలిసి ప్రభుత్వ వైద్యశాలలో సందదర్శించారు. మతుడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చాడు.

## ముగ్గురికి గాయాలు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

బైకు అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బోయలపల్లి సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. నంద్యాల జిల్లా సున్నిపెంట గ్రామానికి చెందిన దోమతోటి శ్రీరాములు, దోమతోటి కోటయ్య, కూకటిపల్లి రమేష్ బైకుపై యర్రగొండపాలెం మండలం జంగంవారిపల్లిలో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో బోయలపల్లి సమీపం వద్దకు వచ్చేసరికి బైకుకు ఎదురుగా ట్రాక్టర్ వచ్చింది. దీంతో బైకు అదుదపు తప్పి డివైడర్‌ను ఢీకొంది క్షతగాత్రులను 108 వాహనంలో యర్రగొండపాలెం ఏరియా వైద్యశాలకు తరలించారు.

## చెట్టు కూలి యువకుడు మృతి

**ప్రజాశక్తి- అద్దంకి**

వేప చెట్టు నరుకు తున్న సమయంలో మీద పటడంతో ఓ యువ కుడు అక్కడకక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని వెంకటా పురంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన టి. అంకమ్మరావు(17) అనే యువకుడు గ్రామంలోని చెరువు వద్ద వేప చెట్టు తొలగిస్తున సమయంలో చెట్టు మీదుపడంతో అక్కడి క్కడే మృతిచెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తికి గాయాలు

**ప్రజాశక్తి అద్దంకి**

టీవీఎస్ వాహనాన్ని కంటైనర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకార.. భవానీ సెంటర్ టీవీ రిపేర్‌షాప్ నిర్వహిస్తున్న షేక్ రంజాన్ మధ్యాహ్న భోజనం అనంతరం టీవీఎస్ వాహనంపై దుకాణం వద్దకు వస్తున్నాడు. అదే సమయంలో సింగరకొండ వైపు నుంచి మేదరమెట్ల వైపు వెళుతున్న కంటైనర్ టీవీఎస్ ఢీకొంది. దీంతో రంజాన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఫిబ్రవరిలో ప్రతిభా పరీక్షలు

**చీరాల :** ఇంజినీరింగ్ పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సుల ప్రవేశాలకై జాతీయ స్థాయిలో కెఎల్.యూనివర్సిటీ విజయవాడ, హైద్రాబాద్ క్యాంపస్ లలో 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రతిభా పరీక్షను నిర్వహించనున్నట్లు అడ్మిని స్ట్రేషన్ విభాగం డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు తెలిపారు. చీరాలలోని శ్రీమేధావి జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతఏడాది డిసెంబరు 22 నుంచి 26 వరకూ నిర్వహించిన మొదటి దశ పరీక్షకు దేశ వ్యాప్తంగా 75వేలమంది హాజరైనట్లు తెలిపారు. రెండవ దశ ఫిబ్రవరి 3, 4,5,6 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షకు లక్షమందికి పైగా దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిభా పరీక్షలలో ప్రతిభ కనబరిచిన వారికి రూ. 100 కోట్ల రూపాయల మేర మెరిట్ స్కాలర్ షిప్స్ అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీమేధావి జూనియర్ కళాశాల డైరెక్టర్ మాదాల వెంకట దుర్గా కుమార్, ప్రిన్సిపల్ తాళ్ళూరి సత్యన్నారాయణ, వైస్ ప్రిన్సిపల్ షేక్ అహ్మద్, అకడమిక్ ఇన్‌ఛార్జి చేబ్రోలు అవినాష్, యూనివర్సిటీ ఆంధ్రప్రదేశ్ కర్ణాటక జోనల్ హెడ్ బి. శివరామ కష్ణ, మేనేజర్లు ఆంజనేయ ప్రసాద్, మస్తాన్ వలి, కళ్యాణ్, లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వేపై శిక్షణ

**వేటపాలెం :** త్వరలో అందరికీ ప్రాపర్టీ ఓనర్ షిప్ కార్డులు జారీ చేయనున్నట్లు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వైఎస్.నాయక్ తెలిపారు. స్థానిక ఐసిడియస్ కార్యాలయంలో జిల్లా స్థాయి స్వమిత్వ-సర్వే శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ వై.శంకర్ నాయక్ మాట్లాడుతూ జగనన్న భూహక్కు ,భూ రక్ష పథకంలో గ్రామీణ ప్రాంతాల్లో ఆస్తిపై స్పష్టమైన యాజమాని నిర్ణయించాలన్నారు. సర్వే ఆలస్యం అవడానికి సిబ్బందికి ఖచ్చితమైన శిక్షణ లేకపోవడమేని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ వెంకటరావు, డిప్యూటీ సర్వేయర్లు టి.శ్రీనివాసరావు, యం.శ్రీనివాసరావు, ఎంపిడిఒ శర్మ, చిన్నగంజాం, వేటపాలెం ఇఒఆర్‌డిలు కె.స్వరూపారాణి,¬ క.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## బిస్కెట్లు పంపిణీ

**పంగులూరు :** చక్కగా చదువుకుంటున్న విద్యార్థులు అంటే తనకెంతో ఇష్టం అని, వారు సంతోషంగా ఉండటమే తన లక్ష్యమని అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ తెలిపారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా మంగళవారం బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు అజిత్ కుమార్ జ్ఞాపకార్థం ప్రతి ఏటా స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డే సందర్భాల్లో మండలంలోని అన్ని పాఠశాలలకు, బిస్కెట్లు ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రిపబ్లిక్ డే సందర్భంగా మండలంలోని 45 పాఠశాలలోని 4,100 మంది విద్యార్థులకు బిస్కెట్లు చేయనున్నట్లు తెలిపారు.

## కంటి అద్దాలు అందజేత

**చీరాల :** పేదలకు సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ ముందుం టుందని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు తవ్వా రామకష్ణ, మారుటూరి రాఘవేంద్రరావు తెలిపారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఎఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు.1 5 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు అసరమని గుర్తించారు.క్లబ్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వీరాంజనేయులు, క్లబ్ కోశాధికారి ఆలపాటి వేణు గోపాలరావు, శ్రీరెళ్ల రాముడు, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు పనులు పరిశీలన

**భట్టిప్రోలు :** నాడు- నేడు పనులు నాసిరకంగా నిర్వహిస్తున్నట్లు ప్రజాశక్తి దిన పత్రికలో సోమవారం ఓ కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. ఎంఇఒ పులి లాజర్, పిఆర్ ఎఇ రామ చంద్రరావు పెదపులివర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న నాడు-నేడు పనులను మంగళవారం పరిశీలించారు. పనులు నాణ్యాతా ప్రమాణాలతో చేపట్టాలని సూచించారు. పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో సిఆర్‌పిలు పాల్గొన్నారు.

### బాలికలు ఉన్నత లక్ష్యంతో...

# ముందుకు సాగాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - చీరాల**

బాలికలు ఉన్నత లక్ష్యంతో ముందుకు అందు కోసం కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. చీరాల కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికల విద్య కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో పాఠశాలలో డ్రాప్‌అవుట్స్ ఉండకూడదన్నారు. కస్తూరిబా గాంధీ పాఠశాలలో చదువుకునే బాలికలు నూరు శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన,వక్తత్వ, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన బాలికలకు నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో డిఇఒ రామారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి సరోజిని, జిల్లా సైన్స్ ఆఫీసర్ సాధిక్ , ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్


**పేరాల ఆంధ్రరత్న మున్సిపల్ హైస్కూల్‌లో**

బాలికలు అన్ని రంగాలలో అభివద్ధి చెందాలని శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ తాడివలస దేవరాజు తెలిపారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పేరాలలో ఆంధ్ర రత్న మున్సిపాలిటీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు బేతాళ సాల్మన్ అధ్యక్షతన డెబిట్ కాంపిటేషన్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పేరాల హై స్కూల్‌ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు శిరీష, హరిత, ప్రోగ్రామ్ కోర్డినేటర్ మాస్టర్ భాను చంద్రమూర్తి ,ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, గాంధీ ,కష్ణ మోహన్, ,చంద్ర శేఖర్ , కుమార్ ,శ్రీను,సుశీల ,మాధవి ,ప్రసన్న ,బషీర్ ,రేవతి ,జ్యోతి తదితరులు పాల్గొన్నారు. **పెద్దారవీడు :** స్థానిక కస్తూరిభాగాంధీ గురుకుల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పి.లలిత సలోమిని, ఎం.లక్ష్మీదేవి, ఎన్.అంజమ్మ ఆధ్వర్యంలో బాలికలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసు భారతి, అంగన్‌వాడీలు జి.సావిత్రి, దుర్గారాణి, నాగమ్మ, వీరనారాయణమ్మ, కెజిబివి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **టంగుటూరు :** స్థానిక పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ బాలికల దినో త్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఎలక్యూషన్‌పై డిబేట్ నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జవివికె. మూర్తి, అడ్మిషన్స్ డైరెక్టర్ ఆర్.వీరాంజనేయులు, ఎఒ రమణబాబు, డబ్ల్యుపిసి కన్వీనర్ వైష్ణవి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **బాపట్ల రూరల్ :** బాలికల చదువు భావి తరాలకు వెలుగు అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వర్లు రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వెదుళ్లపల్లి ఎంపిపి స్కూల్‌లో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్ల చదువు వల్ల కుటుంబానికి ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అబ్దుల్ సలాం, తిరుమల రావు,షేక్ సుబాని,శ్యాం సుందర్,కష్ణ వేణి, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు. **ఇంకొల్లు రూరల్ :** బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ హెచ్చరించారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా అంకమ్మ కాలనీలో అవగాహన సదస్సు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలను కూడా బాలురతో సమానంగా చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ టి.అంజలి, ప్రధానోపాధ్యాయుడు షేక్ మస్తాన్‌వలి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కోటేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **సంతమాగులూరు :** బాలికలు ఉన్నత చదువులు చదివి, అన్ని రంగాలలో ముందుండి గొప్ప పదవులు అధిరోహించాలని ఎంఇఒ వేమవరపు కోటేశ్వరరావు, సిడిపిఒ సుధ తెలిపారు. మండల పరిధిలోని ఏల్చూరు కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి బాలికలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగరాజకుమారి, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, అంగన్ వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **భట్టిప్రోలు:** స్థానిక టిఎంరావు ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ క్రాఫ్ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దారా రవికిరణ్మయి, పాఠశాల హెచ్ఎం రామకోటేశ్వరరావు,కరస్పాండెంట్‌మల్లికార్జునరావు,నాయక ులు చెన్నయ్య, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** స్థానిక హైస్కూల్‌లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి దుంపా రమణమ్మ, గ్రామ సర్పంచి దర్శి నాగమణి, తహశీల్దారు శ్రీనివాసరావు, ఎంపిడిఒ కె. రాఘవేంద్ర , ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ప్రసాద్, హైస్కూల్ హెచ్ఎం రామారావు, పిఇటిలు మల్లికారాణి, శ్రీనివాసరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి , ఆదిలక్ష్మి పాల్గొన్నారు. **రేపల్లె :** బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఇవిఆర్. గిరి కుమారి తెలిపారు. చైల్డ్ రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాణిక్యం మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు, మగ పిల్లలు సమానమేనని తెలిపారు. ఆడపిల్లల పట్ల వివక్షత ఉండరాన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్నేహలతచ చైల్డ్ అడ్వకేసి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాసరావు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి. బివి. రత్నం, నాగలక్ష్మి, భవాని, ప్రమీల పాల్గొన్నారు.


# సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా

**ప్రజాశక్తి-రేపల్లె**

అంగన్‌వాడీల సమస్యలు పరిష్క రించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సిఐటియు బాపట్ల జిల్లా అధ్యక్షుడు సిహెచ్.మణిలాల్ విమర్శించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పేస్ యాప్ రద్దు చేయాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని కోరుతూ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సిడిపిఒ డి.మాణిక్యంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణిలాల్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమస్యలు పరిష్కరిచంపోగా ఫేస్ యాప్ హాజరు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ రేపల్లె ప్రాజెక్టు అధ్యక్షురాలు బి.రమాదేవి, నాయకులు నిర్మల జోతి, చలమ్మ, సూర్యలక్ష్మి, శారద పాల్గొన్నారు.**బాపట్ల రూరల్ :** అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.20 వేలు ఇవ్వాలని,


రేపల్లెలో సిడిపిఒకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

పేస్ రీడింగ్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందర్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మజుందర్ మాట్లాడుతూ అధికారంలో రాకముందు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తెలంగాణా కంటే అదనంగా అంగన్‌వాడీలకు వేతనం ఇస్తానని వాగ్దానం చేసినట్లు తెలిపారు. ఆ వాగ్దానం నేటికీ అమలు కాలేదని తెలిపారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు గౌరవాఅధ్యక్షుడు జై. శామ్యూల్ మాట్లాడుతూ 2017 నుంచి అంగన్‌వాదీలకు టిఎలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఒకటో తేదీనే అంగన్‌వాడీలకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం సిడిపిఒకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షకార్యదర్శులు శైలశ్రీ, వసంతకుమారి పాల్గొన్నారు..**చీరాల :** అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పేస్ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు చీరాల పట్టణ అధ్యక్షుడు ఎన్. బాబూరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ చీరాల అర్బన్ ప్రాజెక్ట్ కార్యదర్శి జి.సుజీవన మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె.జ్యోతి, అనిత, హనుమాయమ్మ, ఇందిరాణి, కళావతి, శిరీషా, ఉషా పాల్గొన్నారు. **పర్చూరు :** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిడిపిఒ కార్యలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజిబెత్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం నాయకులు జి.అనిత, క్రీస్తు రాజ్యం, దేవమణి, సరళ, ఉష, నాగమణి, ఎం.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

**ప్రజాశక్తి-ముండ్లమూరు**

పేద ప్రజల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండో రోజైన మంగళవారం పసుపుగల్లు గ్రామంలో ఇంటింటికీ తిరిగి.. ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, జెడ్‌పిటిసి రత్నరాజు, తహశీల్దార్ ఎస్ ఉషారాణి, ఏపిఓ కొండయ్య పాల్గొన్నారు.

## రోడ్డుప్రమాదాల నివారణకు సహకరించాలి

### సిఐ దాచేపల్లి రంగనాథ్

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

వాహనచోదకులు నిర్లక్ష్యం వీడి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని శింగరాయకొండ సిఐ దాచేపల్లి రంగనాథ్ అన్నారు. మంగళవారం శింగరాయకొండ పోలీస్‌స్టేషన్ వద్ద నుండి ఎస్సై ఫిరోజ్ ఫాతిమా తమ సిబ్బందితో చేపట్టిన రోడ్డు భద్రతా వారోత్సవాల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందితో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై మొహిద్దీన్ పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి-తర్లుపాడు**

తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇగ్నైట్స్ యంగ్ వారి ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను మంగళవారం ఎంపిపి సూరెడ్డి భూలక్ష్మి సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ క్రీడల్లో గ్రూప్ డిస్కషన్ సీనియర్ జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో తర్లుపాడు జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో చెన్నారెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలవిద్యార్థులు నిలిచారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, సర్పంచ్ పల్లెపోగు వరాలు, సీనియర్ వైసిపి నాయకులు సూరెడ్డి రామసుబ్బారెడ్డి, రాగసముద్రం సర్పంచ్ రమణారెడ్డి, తర్లుపాడు ఉపసర్పంచ్ వెన్నా పెద్దసత్యనారాయణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.మాధవి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి: ఎంపిపి

**ప్రజాశక్తి-చీమకుర్తి**

మండలంలోని వివిధ శాఖలలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేద్దామని ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ మీటింగ్‌లో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ, విద్యుత్, వెలుగు, ఎన్ఎస్పీ, ఎన్ఆర్‌జిఎస్, వైద్యశాఖలపై సమీక్ష చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు జ్యేష్ఠ శ్రీనివాసరావు, లక్ష్మయ్య, తహశీల్దార్ పిన్నిక మధుసూదనరావు, ఎంపిడిఒ వందరమెన్, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరికీ 'ఉపాధి' కల్పిస్తాం: ఏపీవో

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పిస్తామని ఉపాధి హామీ పథకం ఏపీవో కందుకూరి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని యల్లారెడ్డి పల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వంద రోజులు పూర్తి కానీ కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కొలతల ప్రకారమే నగదు జమ అవుతుందని అన్నారు. పనులకు వచ్చిన వారికే మాత్రమే హాజరువేయాలన్నారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.

## 'డిజిటల్ పేమెంట్' వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-పొదిలి**

ఆర్టీసీ బస్సుల్లో నూతనంగా ప్రవేశపెట్టిన డిజిటల్ పేమెంట్ సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ సుందరరావు అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో డిజిటల్ పేమెంట్ గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టిఐ ధనలక్ష్మి, టి.ఐ లు వలి, షరీఫ్, శేషయ్య పాల్గొన్నారు.

# ఒంగోలు ప్రజల రుణం తీర్చుకుంటా..

### ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

**ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్**

తనను ఐదు సార్లు గెలిపించిన ఒంగోలు నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఒంగోలు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం మంగళవారం ఒంగోలులో ఆయన అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లు బీదా మస్తాన్‌రావు, భూమన కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఒంగోలులో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కొరకు రూ.339 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

### వైసిపికి ప్రజల్లో విశేష ఆదరణ

వైఎస్ఆర్ కాంగ్రెసు పార్టీకి ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తుందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నగరంలోని 33వ డివిజన్ జడ్పీ కాలనీ మెయిన్‌రోడ్డు, దత్తసాయినగర్‌లలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, స్థానిక కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంతకుమారి, నగర కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, ఇంజనీర్ కె మాల్యాద్రి, స్థానిక వైసిపి నాయకులు పెద్దిరెడ్డి బాస్కర్ రెడ్డి, నాగూర్, జేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి సీనియర్ నేత వెంకటేశ్వర్లు మృతి





నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి, పూర్ణచంద్రరావు ఇన్‌సెట్లో చీమకుర్తి వెంకటేశ్వర్లు (ఫైల్)

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు చీమకుర్తి వెంకటేశ్వర్లు(59) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఇటీవల ఆరోగ్యం బాగాలేక ఆసుపత్రిలో ఉన్న ఆయనను సోమవారం నాడు నివాసమైన మూలగుంటపాడుకు తీసుకొచ్చారు. మంగళవారం ఆయన మృతిచెందారు. ఆయన తెలుగుదేశం పార్టీలో ప్రారంభం నుంచి ఉన్నారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా ఎక్కువకాలం పనిచేశారు. ఎంపీటీసీగా కూడా గెలుపొందారు. ఆయన భార్య చీమకుర్తి రవణమ్మ ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. వెంకటేశ్వర్లు మృతదేహానికి కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు పూలమాల వేసి.. నివాళులర్పించారు. అనంతరం ఆయన భార్య మాజీ ఎంపీపీ చీమకుర్తి రవణమ్మను, ఆయన కుమారుడు తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చీమకుర్తి కష్టను, చీమకుర్తి శ్రీకాంత్‌ను పరామర్శించారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ, ఒంగోలు మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు అందుబాటులో లేనందువలన ఫోన్ చేసి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో గొర్రెపాటి రామయ్యచౌదరి, నారాయణస్వామి, బంగారయ్య, మండలపు గాంధీచౌదరి, కూనపురెడ్డి సుబ్బారావు, హైమావతి, వేల్పుల సింగయ్య, మించల బ్రహ్మయ్య, పులివర్తి లక్ష్మీనారాయణ, ఇమ్మడిశెట్టి రామారావు, సైకం చంద్రశేఖర్, కన్నా శ్యాంప్రసాద్, పసుపులేటి శేషు, వెంకటేష్ చౌదరి, వికలి తిరుపతిరావు, యస్దాని షేక్ బచ్చే, షేక్ సందానిభాషా, సుదర్శన్, ప్రసాద్‌రావు ఉన్నారు.

## ఘనంగా బాలికా దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రిన్సిపాల్ ఎస్ తిరుమలాదేవి అధ్యక్షతన జాతీయ బాలికా దినోత్సవం వేడుకలు షార్ప్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.ఆంజనేయులు, ప్రిన్సిపాల్ తిరుమలాదేవి, సిఆర్‌పి గురువార్జున్, షార్ప్ సంస్థ ప్రతినిధులు భాగ్య లక్ష్మి, మరియబాబు, మహాలక్ష్మి, అంకయ్య, మార్తమ్మ, సుప్రియ, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

**మార్కాపురం రూరల్:** బాలికలు ఎదుర్కొంటున్న వివక్ష, అసమానతల నిర్మూలనే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు మార్కాపురం జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రాహుల్ తెలిపారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవంను పురస్కరించుకొని పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు దీపిక మంజుష, రాజశేఖర్ పాల్గొన్నారు.

**ముండ్లమూరు:** ముండ్లమూరులోని కెజిబివి బాలికల పాఠశాలలో జాతీయ బాలికాదినోత్సవం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారిణి ఆవుల సునీత అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ డి.హేమలత పాల్గొన్నారు.

## సంజీవరావుపేటలో 'పొలం బడి'

**ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్**

మండలంలోని సంజీవరావుపేట రైతుభరోసా కేంద్రం ఆధ్వర్యంలో శనగ పంటలో డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై.విజయభాస్కరరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ నాయకులు వెంకటరవి పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్, శింగరాయకొండ శాఖ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత, సాంకేతిక అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్థిక లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో క్షేత్రాధికారి ఇంతియాజ్ పాల్గొన్నారు.

### రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో

# ఇండో బ్రిటీష్ ఆసుపత్రిలో వైద్యసేవలు

- ఈ నెల 26 నుంచి ప్రారంభం
- దేశంలోనే మొదటిసారిగా క్లౌడ్‌డాక్స్‌తో అనుసంధానం
- అంతర్జాతీయ స్థాయి మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

**ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ**

రమేష్ ఆసుపత్రి ఆధ్వర్యంలో విజయవాడ శ్రీనివాస నగర్ బ్యాంక్ కాలనీలోని ఇండోబ్రిటీష్ హాస్పిటల్‌లో గుండె జబ్బుల ప్రత్యేక వైద్యవిభాగం ఈ నెల 26న ప్రారంభించనున్నట్లు డాక్టర్ రమేష్ హాస్పటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే ప్రప్రథమంగా ఇండో బ్రిటీష్ ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో క్లౌడ్ డాక్స్ (టెలి ఐసియు)కు అనుసంధానం చేయడం ద్వారా 24 గంటలూ రోగులు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో ఉంటారన్నారు. ఇక్కడ 50 పడకలతో అంతర్జాతీయ స్థాయి మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్, అత్యాధునిక క్యాత్‌ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గుండె వైద్యనిపుణులు డాక్టర్ పి.వి.ఎస్. శ్రీనివాస్‌ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డియాలజిస్టు డాక్టర్ షహనాజ్, ఎలక్ట్రోఫిజియాలజిస్టు డాక్టర్ చంద్రమౌళి, చిన్న పిల్లల గుండె వైద్యనిపుణులు డాక్టర్ జ్యోతి ప్రకాష్, డాక్టర్ వాసుదేవ్, సీనియర్ గుండె శస్త్రచికిత్స వైద్యనిపుణులు డాక్టర్ జయరాంపాయ్, డాక్టర్ శివ ప్రసాద్, డాక్టర్ భరత్ సిద్దార్థలతో కూడిన వైద్య బృందం ఉంటుందన్నారు. హార్ట్ ఎటాక్, స్టెంట్ యాంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీ, వాల్వ్ మార్పిడి సర్జరీ, ఫేస్‌మేకర్, రేడియో ఫ్రీక్వెన్సీ, అబ్లేషన్, హార్ట్ ఫెయిల్యూర్‌కు సీఆర్‌డి, చిన్న పిల్లల గుండె జబ్బులకు వైద్య బృందం వైద్య సేవలందిస్తుందని తెలిపారు. ఇన్సూరెన్స్ పేషెంట్లతో పాటు కార్పొరేట్ రంగ ఉద్యోగులకు, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్, జర్నలిస్టు హెల్త్ స్కీమ్ లబ్ధిదారులకు నాణ్యమైన వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు లేని పేదలకు ఆరోగ్యభాగ్యం స్కీంలో రాయితీతో కూడిన వైద్య సేవలను అందించనున్నట్లు తెలిపారు. రమేష్ హాస్పటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో విజయవంతంగా 19 వేల యాంజియోప్లాస్టీ బైపాస్ సర్జరీ చిన్నపిల్లల గుండె చికిత్సలు, ఫేస్‌మేకర్‌లు నిర్వహించామన్నారు. 26వ తేదీ ఉదయం 11 గంటలకు రమేష్ హాస్పటల్స్ ఛైర్మన్ ఎం.ఎస్.రామమోహనరావు చేతుల మీదుగా వైద్య విభాగాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ప్రముఖ విద్యావేత్త డాక్టర్ ఎం.సి.దాస్, కార్డియాలజిస్టు డాక్టర్ షహనాజ్ పాల్గొన్నారు.

## సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

### అధికారులకు ఎమ్మెల్యే మద్దిశెట్టి ఆదేశం

**ప్రజాశక్తి-దర్శి**

అధికారులు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో పలు డిపార్టుమెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిశెట్టి మాట్లాడారు. కార్యక్రమాలలో ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## పరిటాల రవికి ఘన నివాళి

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

మాజీ మంత్రి పరిటాల రవి వర్ధంతి సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. స్థానిక నిర్మల్ నగర్‌లో 36వ డివిజన్ టిడిపి నాయకులు, పరిటాల రవి అభిమానులు దాయినేని ధర్మ, నల్లూరి ప్రదీప్, జివిఎస్ఆర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరిటాల రవి వర్ధంతి మంగళవారం జరిగింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరరావు, గుర్రాల రాజ్ విమల్ పాల్గొన్నారు.

**పామూరు:** పరిటాల రవీంద్ర ఆశయాల కోసం తెలుగుదేశం కార్యకర్తలు పనిచేయాలని మాజీ జడ్‌పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి అన్నారు. మంగళవారం పరిటాల రవీంద్ర వర్ధంతి సందర్భంగా టిడిపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హుస్సేన్‌రావు యాదవ్, షేక్ రహంతుల్లా పాల్గొన్నారు.

## వాలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాశక్తి-జరుగుమల్లి**

మండలంలో నాలుగు వాలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని.. అర్హులు బుధవారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ పి.రామకృష్ణ తెలిపారు. అక్క చెరువుపాలెం ఓసి జనరల్ 1, ఎడ్లూరపాడు ఓసి 1, జనరల్ ఓసి మహిళ 1, రామచంద్రాపురం ఓసి జనరల్ 1 ఖాళీ ఉందన్నారు. అభ్యర్థులు పదో తరగతి పాసై ఉండాలని చెప్పారు.

## రైతులు ఈ-కేవైసి చేయించుకోవాలి

### వ్యవసాయాధికారి జైనులాబ్దిన్

**ప్రజాశక్తి-పొదిలి**

మండలంలో 2022-23 రబీ సీజన్‌కు పంటలు సాగు చేసి.. నమోదు చేయించుకున్న రైతులు రైతు భరోసా కేంద్రాలలో ఈ-కెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్‌కె జైనులాబ్దిన్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని ఏలూరు, ఉప్పలపాడు, తలమళ్ల గ్రామాలలో సాగులో ఉన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పైరెడ్డిపాలెంలో 'గడపగడపకూ..'

**ప్రజాశక్తి-పొన్నలూరు**

మండలంలోని పైరెడ్డిపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి కొండపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ గడపగడపకూ.. మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సంక్షేమ ఫలాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకోనేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

### ఎంపిపి దంతులూరి ప్రకాశం

**ప్రజాశక్తి-కనిగిరి**

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎంపిపి దంతులూరి ప్రకాశం తెలిపారు. కనిగిరి మండల పరిషత్ కార్యాలయంలో వివోఏల సమావేశం ఏపిఎం జీవరత్నం అధ్యక్షతన జరిగింది. ఎంపిపి ప్రకాశం మాట్లాడుతూ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని, తీసుకున్న రుణాలను సకాలంలో తిరిగి బ్యాంకులకు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో డిఎంజి ద్రోణాదుల బాల సుబ్రమణ్యం, సిసిలు పాల్గొన్నారు.

# ప్రజాసంక్షేమానికి పెద్దపీట: కుందురు

**ప్రజాశక్తి-పొదిలి**

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఒకటో వార్డులో నాల్గవ రోజు గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని.. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు సానికొమ్ము శ్రీనివాస రెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాస రెడ్డి, కొండ్రగుంట సుబ్బారావు, కొత్తపులి బ్రహ్మారెడ్డి, పేరం కోదండ రామిరెడ్డి, గూడూరి వినోద్ కుమార్ పాల్గొన్నారు.



గడపగడపకూ.. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి

# పథకాలు అందకపోతే చెప్పండి: బుర్రా

**ప్రజాశక్తి-పిసిపల్లి**

అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకొని రావాలని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని చౌటగోగులపల్లిలో శాసనసభ్యులు బుర్రా మధుసూదన్‌యాదవ్ మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నవరత్నాల పేరుతో అందరి అభివృద్ధికి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆయన వెంట ఎంపిపి అత్యాల జక్యన్య, మురుగుమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్, కన్వీనర్ల మండల నాయకులు శీలం సుదర్శనం, మాజీ కో ఆప్షన్ సభ్యులు నజీర్‌బాషా, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా

# గ్రామ సమస్యలపై పోరాటం చేస్తా..

## జనసేన గిద్దలూరు ఇన్‌ఛార్జి బెల్లంకొండ

**ప్రజాశక్తి-గిద్దలూరు**

ఇప్పటి నుండి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలోని సమస్యలపై పోరాటం చేస్తానని జనసేన పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బెల్లంకొండ సాయిబాబు అన్నారు. పట్టణంలోని విట్టా సుబ్బరత్నం కల్యాణమండపంలో మంగళవారం జరిగిన జనసేన పార్టీ సమావేశంలో సాయిబాబు మాట్లాడారు. రాబోవు ఎన్నికలలో ప్రజలు ప్రజా సమస్యలు పరిష్కరించే నాయకుడిని ఎన్నుకోవాలని అన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ మాట్లాడుతూ జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో జనసేన పార్టీ గెలుస్తుందన్నారు. జనసేనకు పట్టున్న గిద్దలూరు నియోజకవర్గంలో కూడా ఈ సారి జనసేన పార్టీ తరఫున నిలబడే వ్యక్తిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లంకా నరసింహారావు, యగటీల రంగయ్య, కాల్వ బాల రంగయ్య, నారాయణ, తాటిశెట్టి ప్రసాద్, ముత్యాల కళ్యాణ్, అలిశెట్టి వెంకటేశ్వర్లు, చిట్టెం ప్రసాద్, రాయిని రమేష్ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సాయిబాబు

# ఆడపిల్లల పట్ల వివక్ష వద్దు

**ప్రజాశక్తి-టంగుటూరు**

వివక్షతతో ఆడపిల్లల స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ షేక్ సైదాబీ అన్నారు. మంగళవారం టంగుటూరుతో పాటు మండలంలోని జమ్ములపాలెం, వల్లూరు, కొణిజేడు తదితర గ్రామాలలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు 'ఆడపిల్లను బతకనిద్దాం.. చదవనిద్దాం, ఎదగనిద్దాం' అనే నినాదాలతో గ్రామాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చిన్నతనం నుండే ఆడపిల్లలను పురుషులతో సమానంగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

**కనిగిరి:** నేటి సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలియజేశారు. ఐసిడిఎస్, ఎస్‌ఎస్‌ఎ, మండల న్యాయసేవాధికార సంస్థ, గుడ్‌హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిడిపిఒ సంగీతలక్ష్మి, గుడ్‌హెల్ప్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి, సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు.

**పొదిలి:** బాలికలను బతకనిద్దాం.. వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దామని మండల విద్యాశాఖ అధికారి ఎం.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా సిడిపిఒ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండల పరిషత్ కార్యాలయం నుండి పెద్ద బస్టాండ్ వరకు అంగన్‌వాడీలు, పాఠశాల విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పిసిపల్లి:** జాతీయ బాలికా దినోత్సవం భాగంగా మండలంలోని పెదఇర్లపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ, స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు ఎస్‌కె. నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో మంగళవారం బాలిక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షులు ఎస్.కె.నాయబ్‌రసూల్, ప్రధానోపాధ్యాయురాలు ఎల్.అనురాధ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్




కార్డులు పంపిణీ చేస్తున్న జక్రయ్య

## ఆటో కార్మికులు ఐక్యంగా ఉండాలి

### సిఐటియు మండల అధ్యక్షులు షేక్ మస్తాన్

**ప్రజాశక్తి-పామూరు**

ఆటో కార్మికులు ఐక్యంగా ఉండి ప్రయాణికులకు అనుసంధానంగా ఉండాలని సిఐటియు మండల అధ్యక్షులు షేక్ మస్తాన్ అన్నారు. మంగళవారం మండలంలో వగ్గంపల్లి సెంటర్‌లో ఆటోవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. అనంతరం కార్డులు పంపిణీ చేశారు. పోలీసు క్యూఆర్ కోడ్ తప్పనిసరిగా వేయించుకోవాలని, లైసెన్సు లేనివారు లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. యూనియన్‌లో ఉన్న ప్రతి ఆటో కార్మికుడు సీరియల్‌లో ఆటో నడుపుకోవాలని, అతివేగంగా వెళ్లవద్దని సూచించారు. అనంతరం సిహెచ్ జక్రయ్య ద్వారా కార్డులు పంపిణీ చేశారు. వగ్గంపల్లి ఆటో వర్కర్స్ కమిటీని నూతనంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పి.జాన్‌వర్గీస్, కార్యదర్శి షేక్ ఖాజమొహిద్దీన్, కోశాధికారి పి.తిరుపాలు, ఉపాధ్యక్షులు పి. ఏసుపాదం, సహాయ కార్యదర్శి షేక్ మహబూబ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## రెండోరోజుకు చేరిన రిలే నిరాహారదీక్ష

**ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్**

మండలంలోని ఆదిమూర్తిపల్లె గ్రామ స్వచ్ఛభారత్ కార్మికుడు పుల్లయ్యను విధుల్లోకి తీసుకోవాలని చేపట్టిన దీక్ష మంగళవారం రెండోరోజుకు చేరుకుంది. గిద్దలూరు ఎంపిడిఓ కార్యాలయం ఎదుట పుల్లయ్య కుటుంబ సభ్యులు, స్వచ్ఛభారత్ కార్మికులు సోమవారం దీక్ష ప్రారంభించిన విషయం తెలిసిందే.. రెండోరోజు దీక్షలో సిఐటియు నాయకులు బి.నరసింహులు మాట్లాడుతూ పుల్లయ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేనియెడల జనవరి 27వ తేదీ నుండి మండలంలో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులందరూ పుల్లయ్యకు మద్దతుగా దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. మండలం లోని అన్ని గ్రామాల్లో పని చేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులందరూ ఉదయం, సాయంత్రం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించే ఫొటో కార్యక్రమాన్ని నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. దీక్ష కార్యక్రమంలో పుల్లయ్య కుటుంబసభ్యులు, స్వచ్ఛభారత్ కార్మికులు ఆనందరావు, నరసయ్య, జి.ప్రభాకర్, రామయ్య, రాజయ్య పాల్గొన్నారు.

## 'సర్వనేత్రాలయ'లో ఉచితంగా ఓపీ సేవలు

**ప్రజాశక్తి-ఒంగోలు**

ఒంగోలు, అంజయ్యరోడ్డులోని సర్వనేత్రాలయ కంటి, రెటీనా హాస్పిటల్‌లో రిపబ్లిక్‌డే సందర్భంగా ఈ నెల 26, 27 తేదీలలో ఉచితంగా ఓపీ సేవలు అందించనున్నట్లు హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఉప్పలపాటి శ్రీనివాసులు, కంటి వైద్యనిపుణులు డాక్టర్ పెనుమెచ్చ మానస ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహిస్తామని, ఆపరేషన్ అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు..

**ప్రజాశక్తి-కనిగిరి**

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి.. పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ, ఏఐటియుసి నాయకులు పేర్కొన్నారు. కనిగిరి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ, ఏఐటియుసి, సిపిఐఎంఎల్, వికలాంగుల హక్కుల వేదిక నాయకులు జి.బాలిరెడ్డి, పి.రమణారెడ్డి, డి.మల్లికార్జునరావు పాల్గొన్నారు.

## వైసిపి పోవాలి..బాబు రావాలి..

### దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు

**ప్రజాశక్తి-దర్శి**

వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో వైసిపికి ప్రజలు ఓటు వేయకుండా సైకిల్ గుర్తుకు ఓటు వేసి.. నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాలని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' అనే కార్యక్రమంలో భాగంగా దర్శిలోని 12వ వార్డులోని పుట్టబజారులో జరిగిన టిడిపి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాపారావు మాట్లాడారు. కార్యక్రమంలో నగర పంచాయితీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మండల పార్టీ అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు యాదగిరి వాసు పాల్గొన్నారు.

# వైసిపి అద్దంకి అభ్యర్థి కృష్ణచైతన్యే..

## వైసిపి బాపట్ల జిల్లా అధ్యక్షులు, ఎంపీ మోపిదేవి



మాట్లాడుతున్న మోపిదేవి వెంకట రమణారావు

**ప్రజాశక్తి- మేదరమెట్ల**

వచ్చే ఎన్నికల్లో అద్దంకి నియోజక వర్గ వైసిపి అభ్యర్థి బాచిన కష్ణ చైతన్యేనని, ఆయన్ని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని వైసిపి బాపట్ల జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు తెలిపారు. మేదరమెట్లలోని ఎస్‌బి కన్వెన్షన్ హాల్లో అద్దంకి నియోజకవర్గ వైసిపి నాయకులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బాచిన కష్ణ చైతన్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలోకష్ణ చైతన్యను గెలిపించుకోవలసిన బాధ్యత అందరిపై ఉంది అన్నారు. రాజ్యసభ సభ్యులు, రీజనల్ కోఆర్డినేటర్ బీద మస్తాన్ రావు, ప్రకాశం, బాపట్ల ,పలనాడు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్, తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎంపిక చేసి అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం మండలాల గ్రామ నాయకులతో విడివిడిగా చర్చలు జరిపి వారి యొక్క అభిప్రాయాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, వైసిపి మండలాల కన్వీనర్లు, మండల అధ్యక్షులు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, అద్దంకి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

**హాజరుకాని పరిరక్షణ సమితి సభ్యులు**

మేదరమెట్లలో నిర్వహించిన అద్దంకి నియోజకవర్గ వైసిపి కార్యకర్తల సమీక్ష సమావేశానికి బాచిన కృష్ణచైనత్యకు వ్యతిరేకంగా ఉన్న పరిరక్షణ సమితి సభ్యులు హాజరు కాలేదు. వైసిపి జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణ, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, తిరుపతి ఎమ్మెల్యే భూమన్న కరుణాకర్ రెడ్డిని నాగులుప్పలపాడు జంక్షన్ వద్ద కలసి తమ సమస్యలు చెప్పుకున్నారు.

## పార్టీకి వ్యతిరేకం కాదు.. వైసిపి పరిరక్షణ సమితి



సమావేశంలో పాల్గొన్న వైసిపి పరిరక్షణ సమితి

**ప్రజాశక్తి -అద్దంకి**

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైసిపికి తాము వ్యతిరేకం కాదని నియోజకవర్గంలో నియంతగా వ్యవహరిస్తున్న నేతకు మాత్రమే తాము వ్యతిరేకమని వైసిపి పరిరక్షణ సమితి నాయకులు తెలిపారు. మేదరమెట్లలో అద్దంకి నియోజకవర్గ వైసిపి కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. సమావేశానికి ఆహ్వానం అందని పరిరక్షణ సమితి నేతలు అద్దంకిలోని ఓ దాబాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఓ మండలానికి,. ఓ గ్రామానికి పరిమితం కాకుండా నియోజకవర్గంలోని గ్రామాల నుంచి మండల స్థాయి వరకు సర్పం చులుగా ఎంపీటీసీలుగా, జడ్పీటీసీ లు గా ప్రజా ప్రతినిధులుగా ప్రజలు గెలిపించినట్లు తెలిపారు. గతంలోనూ రాష్ట్ర ముఖ్యమంత్రితో నిర్వహించిన సమీక్ష సమావేశానికి తమలో ఎవరినీ ఆహ్వానించలేదని తెలిపారు. మేదర మెట్లలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశాన్నికి కూడా తమను ఆహ్వానించపోవటం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా అసమ్మతి నేతలతో మాట్లాడి నియోజక వర్గంలో ప్రశాంత వాతా వరణం కల్పించాలని, అందుకు తామంతా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం నాగులుప్పల పాడు జంక్షన్ వద్ద వైసిపి జిల్లా అధ్యక్షులు మోపిదేవి వెంకటరమణ, పార్టీ పరిశీలకులు బీదర మస్తాన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో కొరిశపాడు జడ్‌పిటిసి రమణమ్మ, వెన్నపూస జోసెఫ్ రెడ్డి, రాము, రాఘవ రెడ్డి, యలమందరావు, రామారావు, షరీఫ్, నాసరరెడ్డి రఘు రామయ్య, శివారెడ్డి, సుధాకర్ రెడ్డి, కష్ణారెడ్డి, సుభాని, పులిపాటి శ్రీనివాస్ రెడ్డి కామేపల్లి శ్రీను, అమర్, ఎంపిటిసి హనుమంతరావు పాల్గొన్నారు.

## టిడిపి కమిటీలు నియామకం

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

టిడిపి ఇంకొల్లు పట్టణ కమిటీలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆమోదం మేరకు మండల అధ్యక్షుడు నాయుడు హనుమంతరావు మంగళవారం ప్రకటించారు. పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా వలేరు మార్కు, పంగులూరి రాజశేఖర్, తెలుగు రైతు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా బెల్లం సాంబయ్య, చిన్న సుబ్బారావు, ఎస్‌టి సెల్ అధ్యక్ష కార్యదర్శులుగా ఆవుల చిన్నపిచ్చయ్య, పాలపర్తి వెంకటకోటయ్య, పట్టణ తెలుగు మహిళ అధ్యక్ష కార్యదర్శులుగా భవనాసి వనజ, కందిమళ్ళ అనంతలక్ష్మి, ఎస్‌సి సెల్ అధ్యక్ష కార్యదర్శులుగా బౌతుల రాజేష్, పల్లెపోగు గిద్యాన్‌ను నియమించారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు

**ప్రజాశక్తి -కారంచేడు**

మండల పరిధిలోని యర్రంవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారంఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. మదర్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు అబ్రహం వెస్లీ, సజన అబ్రహం, పార్సి, షైనీ 150 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా పేస్టులు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మాధవి, మదర్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు మున్నంగి నాగిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-చీమకుర్తి**

చదువులలో రాణిస్తూ ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న బాలికలను శివం పౌండేషన్ అక్కున చేర్చుకుంది. స్థానిక ఎంపిపి కార్యాలయంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాస రావు చేతుల మీదుగా రూ.52 వేల ఆర్థిక సాయం అందజేశారు. పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన గుంటి ధనలక్ష్మికి బిఎస్‌సి నర్సింగ్ చదువుకు రూ.30వేలు,నెహ్రూనగర్‌కు చెందిన ఎం.మధుమతి ఇంటర్ చదివేందుకు రూ.12వేలు, ఏకలవ్యనగర్‌కు చెందిన పేరం అర్చనకు డిగ్రీ చదివేందుకు రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శివం పౌండేషన్ అధ్యక్షుడు గొల్లపూడి శ్రీహరిని అభినం దించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి జ్యేష్ట శ్రీనివాసరావు, ఎంపిటిసి చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, వైసిపి నాయకులు ఏలూరి సుబ్బారావు, విజయ భాస్కరరెడ్డి, బెజవాడ హరి,పల్లపాటి చంద్ర,అత్యాల దావీదు,కత్తి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గృహప్రవేశ వేడుకల్లో బూచేపల్లి

**ప్రజాశక్తి- మద్దిపాడు**

మద్దిపాడు గ్రామానికి చెందిన కానుమాను కోశ్వరరావు నూతన గృహ ప్రవేశ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి చైపర్సన్ బుచేపల్లి వెంకాయమ్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాకుమాను శశికిరణ్ శ్రీవర్మ, అచ్చుత కుమార్ పాల్గొన్నారు.

## మండల సమావేశం వాయిదా

**ప్రజాశక్తి-సంతమాగులూరు**

కోరం లేకపోవడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపిడిఒ సాంబశివరావు తెలిపారు. మండల సర్వసభ్యసమావేశం మంగళవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వారం క్రితమే ప్రజా ప్రతినిధులు, అధికారులకు సమాచారం అందించారు. అయినప్పటికీ ఎంపిటిసిలు హాజరు కాలేదు. ఏల్చూరు ఎంపిటిసి మలిరెడ్డి రమాదేవి ఒక్కరే హాజరయ్యారు. దీంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు

## హెల్మెట్ వినియోగం తప్పనిసరి

**ప్రజాశక్తి - చీరాల**

వాహన చోదకులు తప్పని సరిగా హెల్మెట్లు ధరించి జిల్లా రవాణా శాఖ శాఖ అధికారి ఏ.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా రవాణా శాఖ అధికారి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చీరాల మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ రామ కష్ణా రెడ్డి, బాపట్ల మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ ప్రసన్న కుమారి, మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ పి.అంకమ్మ రావు, చీరాల ట్రాఫిక్ ఎస్ఐ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

## గిడ్డంగులను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాశక్తి-బాపట్ల రూరల్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ద్వారా నిర్వహించే గిడ్డంగులను రైతులు ,ధాన్య యజమానులు సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల వేరే హౌస్ మేనేజర్ ఎల్.శ్రీనివాస రెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 వందల మెట్రిక్ టన్నులు కెపాసిటీ కలిగిని గిడ్డంగులు అందుబాటులో ఉన్నాయన్నారు.ధాన్యం నిలువ చేసుకున్న రైతులకు ధాన్యం పై 80 శాతం బ్యాంకు లోను సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం నిల్వల నిర్వహణలో ఎలాంటి లోటు లేకుండా భద్ర పరుస్తా మన్నారు.గిట్టుబాటు ధర లభించే వరకూ నిల్వ చేసుకొనే సౌకర్యం ఉందన్నారు. బస్తాకు 8 రూపాయల అద్దె చెల్లించాల్సిఉంటుందన్నారు.అందులో 20 శాతం రాయితీ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

## వైద్య సిబ్బంది తీరు పట్ల ఎంపిపి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపిపి అనూష

**ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్**

ప్రభుత్వాసుపత్రికి వైద్యానికి వెళ్లితే సిబ్బంది తనకే చుక్కలు చూపించారని ఎంపిపి బండారు అనుష ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ సర్వ సభ్యసమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తుంటే అక్కడున్న సిబ్బంది మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన కుమారుడు దగ్గుతో బాధపడుతుంటే వైద్యశాలకు తీసుకు వెళితే కనీసం చేయి పట్టుకోకుండా, జ్వరం చూడకుండా మందులు రాసి చేతులు దులుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మందులు ఇచ్చే విషయంలోనూ సిబ్బంది నిర్లక్ష్యంగా, దురుసుగా సమాధానం చెబుతున్నారని తెలిపారు. ఇద్దరు వైద్యులు, సరిపడ సిబ్బంది ఉన్నప్పటికీ వైద్య సేవలు నామమాత్రంగా ఉన్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని చెప్పారు. వైద్యురాలు అంజలి మాట్లాడుతూ తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నానని, పొరపాట్లు ఏమైనా ఉంటే సరిదిద్దుకుంటామని చెప్పారు. చేసిన పనులకు బిల్లులు రాక అప్పులు చేసి ఇబ్బంది పడుతున్నామని నక్కలపాలెం సర్పంచి ఆర్.వేణుబాబు, గంగవరం ఎంపిటిసి మేకల రాజమోహన్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎం.కరుణాకర్, జడ్‌పిటిస బి.శ్రీలక్ష్మి, ఎంపిడిఒ సి.హెచ్ కృష్ణ, వైస్ ఎంపిపి తూమాటి చలమయ్య, కోఆప్షన్ సభ్యులు షేక్ సుబాని, డిటీ గీతారాణి, ఎంపిటిసి రావి పేరయ్య, షేక్ హాయేషాబుడే, వై.శిరోమణి, భీమవరం సర్పంచి రాజ్యలక్ష్మి, పర్చూరు సిడిపిఒ సుభద్ర, గ్రామ కార్యదర్శులు నాగేశ్వరరావు, పి.వెంకట్, ఎపిఒ ఎస్.రేణుక, ఆర్.డబ్ల్యుఎస్ ఎఇ జ్యోతి పాల్గొన్నారు.

## మార్టూరును అభివృద్ధి పథంలో నడిపిస్తా..

### వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆమంచి



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఆమంచి కృష్ణమోహన్

**ప్రజాశక్తి - మార్టూరు రూరల్**

పారిశ్రామికంగా, విద్యా,వ్యాపార రంగంలో ఎదుగుతున్న మార్టూరుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి అభివద్ధి పథంలో నడిపిస్తానని వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కష్ణ మోహన్ తెలిపారు. మార్టూరులో ఆమంచి కృష్ణమోహన్ మంగళవారం పర్యటించారు. తొలుత ఆమంచి రామ్ జనార్ధన్ కాలనీ వద్ద ఉన్న మంచినీటి చెరువును పరిశీలించారు. అనంతరం స్థానిక పాండురంగస్వామి ఆలయం,గంగమ్మ దేవత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమంచి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగాడు. ఈ సందర్భంగా పీర్ల చావడి సమీపంలో ఉంటున్న ముస్లిం కాలనీ వాసులు షాదీ ఖానా లేకపోవడంతో తాము పడుతున్న ఇబ్బందులను ఆమంచి దష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆమంచి త్వరలో షాదీ ఖానా నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామ పంచాయితీ కార్యాలయంలో అధికారులు,సచివాలయ సిబ్బందితో ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, గర్నెపూడి జాన్ సుందరరావు, డైయిరీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి చెంగలయ్య, ఎఎంసి చైర్మన్ జువ్వా శివరాం ప్రసాద్, మాజీ చైర్మన్ జాష్టి వెంకటనారాయణ బాబు,సర్పంచి భూక్యా సుమితా భాయ్ రాజా నాయక్, ఎంపిపి భూక్యా శాంతి భాయ్, బాబు నాయక్, గడ్డం మస్తాన్ వలి, వినుకొండ సుధాకర్ బాబు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి

## జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

**ప్రజాశక్తి-ఒంగోలు క్రైం**

అన్నింటి కంటే ప్రాణం విలువైందని, అందువల్ల వాహనాలపై ప్రయాణించే సమయంలో జాగ్రత్తలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమం స్థానిక ఉప రవాణా కమిషనర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్ డాక్టర్ బి.శ్రీక్రిష్ణవేణి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి సంవత్సరం ప్రభుత్వం భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. వాహనం నడిపే సమయంలో నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో నేత్రవైద్య నిపుణులు డాక్టర్ హరీష్, ఎంవిఐలు కిరణ్‌ప్రభాకర్, రామచంద్రరావు, సురేంద్రప్రసాద్, రవికుమార్, మాధవరావు, ఎఓ సుధాకర్ పాల్గొన్నారు.

# సాయి విధాత్రికి అభినందనలు

## న్యూఢిల్లీలో రిపబ్లిక్ డేలో పాల్గొననున్న ముండ్లమూరు విద్యార్థిని


సాయి విధాత్రి

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

ముండ్లమూరుకు చెందిన ఎన్‌సిసి క్యాడెట్ సాయి విధాత్రి ఈనెల 26న న్యూఢిల్లీలో జరగనున్న గణతంత్ర వేడుకలలో రాష్ట్రం తరపున పాల్గొంటుంది. గణతంత్ర వేడుకలలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల విభాగంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఎంపికైన కొద్ది మంది ఎన్‌సిసి జూనియర్ విభాగంలో ముండ్లమూరు వాస్తవ్యులు కీర్తిశేషులు డి.వెంకట సుబ్బారావు మనుమరాలు, ఆదిలక్ష్మి, చక్రపాణి కుమార్తె 9వ తరగతి చదువుతున్న సాయి విధాత్రి పాల్గొననుంది. సాయి విధాత్రిని గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందించారు.


# పోలీస్ కవాతు రిహార్సల్స్ పరిశీలన

**ప్రజాశక్తి-బాపట్ల జిల్లా**

బాపట్ల పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం నిర్వహించిన పోలీస్ కవాతు రిహార్సల్స్ ను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం పరిశీలించారు.అడ్మిన్ ఆర్.ఐ మన్మధరావు పెరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ పోలీస్ కవాతు రిహార్సల్స్ నిర్వహించారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో నిర్వహించే కవాతు అద్భుతంగా జరపాలని జిల్లా ఎస్పీ సూచించారు. పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకొని, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయంగా చేసుకుంటూ వేడుకలు ఘనంగా నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్ , ఏ.ఆర్-డి.ఎస్.పి ఏం.డి.హెచ్ ప్రేమ్ కుమార్, బాపట్ల డి.ఎస్.పి ఏ.శ్రీనివాసరావు , అడ్మిన్ ఆర్.ఐ ఎల్.మన్మధ రావు , వెల్ఫేర్ ఆర్.ఐ బి.శ్రీకాంత్ నాయక్, ఎస్.బి ఇన్స్పెక్టర్ ఏ. శ్రీనివాస్, బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ కృష్ణయ్య, బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల రెడ్డి , ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలి

- బ్యాంకు ఉద్యోగుల సమ్మెను జయప్రదం చేయాలి
- 108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
- 26న ట్రాక్టర్ల నిరసన ర్యాలీని జయప్రదం చేయాలి
- సిఐటియు జిల్లా వర్క్‌షాప్ తీర్మానం


మాట్లాడుతున్న రమేష్

**ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్**

రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించాలని సిఐటియు జిల్లా వర్క్ షాప్ తీర్మానించింది. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం చట్ట సభల్లో కార్మిక వాణి వినిపించే వారిని గెలిపించుకోవాలని కోరారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో పెట్టుబడిదారులు అన్ని కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికులను బానిసలుగా చూస్తున్నా ప్రభుత్వ యంత్రాంగం వారికి అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిలను గెలిపించాలని కార్మికవర్గానికి విజ్ఞప్తి చేశారు. బ్యాంక్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె ను జయప్రదం చేయాలని వారికి మద్దతు తెలియజేశారు. కస్తూరిబా విద్యాసంస్థలలో పనిచేసే గెస్ట్ ఫ్యాకల్టీస్‌కు 4నెలల నుండి జీతాలు ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, జీవ వ్యవసాయ శాఖ లో పనిచేసే వారికి 6నెలలు జీతాలు బాకాయిలున్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. బ్యాంక్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె కు మద్దతు ఇస్తామని తెలిపారు. 108ఉద్యోగులు చేస్తున్నా పోరాటానికి మద్దతు తెలిపింది. వెంటనే వారి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. స్కూల్ స్వీపర్లకు జీతాలు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 26న సంయుక్త కిసాన్ మోర్చా అధ్వర్యంలో దేశ వ్యాప్త పిలుపులో భాగంగా నిర్వహిస్తున్న ట్రాక్టర్, మోటార్ సైకిల్ ర్యాలీనీ జయప్రదం చేయాలని జిల్లా సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి ఎం. రమేష్ , జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసరావు , జిల్లా ఉపాధ్యక్షుడు జివి కొండారెడ్డి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.కల్పన , జిల్లా ఆఫీస్ బేరర్స్ టి.మహేష్, బంకా సుబ్బారావు , పల్లపల్లి ఆంజనేయులు ,టి.రాము, ఐవి రాగవమ్మ, టి.రంగారావు , అవులయ్య, కె.మాల్యాద్రి , పిసి కేశవరావు , జిల్లా లోని మండల అధ్యక్ష కార్యదర్శులు , అనుబంధ రంగాల బాధ్యులు పాల్గొన్నారు.

# కొండపి ఇన్‌ఛార్జిగా అశోక్‌బాబు వద్దు

- ఎన్నికలలో అశోక్‌బాబుకు టిక్కెట్ ఇస్తే వేరే వ్యక్తితో ఇండిపెండెంట్‌గా పోటీ చేయిస్తాం..
- టిడిపి కోవర్టులకు కొమ్ముకాస్తున్న వరికూటి
- నిజమైన వైసిపి నాయకులను దూరం పెట్టారు..
- వైసిపి సీనియర్ నేతల ఆగ్రహం


మాట్లాడుతున్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-కొండపి**

టిడిపి కోవర్టులను వెంటబెట్టుకుంటూ.. వైసిపిని భ్రష్టు పట్టిస్తున్న వరికూటి అశోక్‌బాబు కొండపి ఇన్‌ఛార్జిగా తమకు వద్దని వైసిపి సీనియర్ నాయకులు అంటున్నారు. మంగళ వారం నాడు కొండపి వైసిపి కార్యాలయంలో ఆరు మండలాల వైసిపి సీనియర్ నాయకులతో పాటు సర్పంచ్‌లు, యంపిటిసిలు, జడ్‌పిటిసిలు, మండల పార్టీ కన్వీనర్లు, మాజీ ప్రజాప్రతినిదులు, తదితరులు కలిసి 'వరికూటి మాకొద్దు' అంటూ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇన్‌ఛార్జిగా వరికూటి రాకతో వైసిపిలో గ్రూపుల పోరు తారాస్థాయికి చేరిందన్నారు. నిజమైన నాయకులను విలువ లేకుండా చేస్తున్నది వరికూటి అశోక్‌బాబు అని అన్నారు. అశోక్‌బాబు తమను కలుపుకొని పోవడానికి వచ్చినా తామందరం కలిసేదానికి సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. 2019 ఎన్నికలలో కొండపి నియోజకవర్గంలో వైసిపి జెండా ఎగరక పోవడానికి కారణం అశోక్‌బాబే అన్నారు. ఆ ఎన్నికలలో టిడిపి వారికి మద్దతు పలికారని, ఇప్పుడు వరికూటి వెంట నడుస్తున్నది వారేనని అన్నారు. మా దగ్గరికి అశోక్‌బాబు వస్తానన్నా అతనితో కలిసే ప్రసక్తే లేదని తెల్చిచెప్పారు. అశోక్‌బాబుకు రాబోయే ఎన్నికలలో టిక్కెట్లు ఇస్తే మేము అందరం కలిసి బలమైన వ్యక్తిని ఇండిపెండెంట్‌గా నిలబెట్టి భారీ మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుగా ఇస్తామని సవాల్ విసిరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిది కొండపి సొసైటి అధ్యక్షులు బొక్కిసం ఉపేంద్రచౌదరి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ బి.అరుణమ్మ, బొట్లా రామారావు, నాగయ్య, రమణారెడ్డి, ఆరు మండలాల సర్పంచ్‌లు, మండల కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫ్లెక్సీలు కనిపించటానికి వీల్లేదు

## - పెట్టిన హోర్డింగ్‌లు తొలగించాలి - అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

జిల్లాలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఏ రూపంలోనూ కనిపించడానికి వీలులేదని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలను ప్రభుత్వం నిషేధించిన నేపథ్యంలో వీటి తయారీదారులతో మంగళవారం తన ఛాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ ఫ్లెక్సీల తయారీతోపాటు డిస్‌ప్లే కూడా ఉండకూడదన్నారు. ఇప్పటికే పెట్టిన హోర్డింగ్స్, ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో అధికారులకు ప్రదర్శనదారులు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఎన్‌జిటి, సుప్రీం కోర్టు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు ఏ రూపంలోనూ తయారీ, ప్రదర్శనకు వీలులేదని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎస్‌పి నాగేశ్వరరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ. నాగి రెడ్డి, జడ్పీ సిఇఒ జాలిరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ ఉషారాణి, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ఇతర మున్సిపాలిటీలు, నగర పంచాయతీల కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.